విద్యార్థుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి: తమ గ్రామంలో మొండి గోడలతో ఉన్న పాఠశాల భవనపు పనులు తక్షణమే పూర్తి చేయాలని గురువారం విద్యార్థినిలు పాఠశాల మొండి గోడలపైకి ఎక్కి వినూత్నంగా నిరసన చేపట్టారు. వాలసి పంచాయతీ పరిధి ఊటగెడ్డ గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాలకు సరైన భవనం లేక ఎండాకాలంలో చెట్లు కింద, వర్షాకాలంలో ఇంటి గడపలో విద్యా బోధనలు కొనసాగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు నాడు పథకం కింద పాఠశాలల రూపురేఖలు తీర్చిదిద్దుతున్నట్లు గొప్పలు చెప్పడం తప్ప కనీసం పాఠశాల భవనాలు నిర్మించ లేని పరిస్థితి నెలకొందని విద్యర్థినిల తల్లిదండ్రులు ఆరోపించారు. తక్షణమే పాఠశాల భవనం పనులు పూర్తి చేసి విద్యార్థులకు సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

నిరసన చేపడుతున్న విద్యార్థులు

నిరాశలో నిరుద్యోగులు

- ఉమ్మడి జిల్లాలో 329 ఉపాధ్యాయ పోస్టులు
- డిఎస్‌సిపై అసంతృప్తిలో బిఇడి, డిఇడి అభ్యర్థులు
- పోస్టుల సంఖ్య పెంచాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-పాడేరు టౌన్:

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మెగా డిఎస్సీ తో పాటు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తానని పాదయాత్ర చేసినప్పుడు నిరుద్యోగులకు జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇది ఇప్పటివరకు హామీల విషయం గుర్తుకు రాలేదు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల తొమ్మిది నెలలు దాటిన తర్వాత ఇప్పుడు మళ్ళీ ఎన్నికల సమయం కావడంతో డిఎస్‌సి అంటూ హడావిడి చేస్తోంది. ఐదేళ్లుగా ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు నిరాశే మిగిల్చింది.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డిఎస్‌సి అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన ముఖ్యమంత్రి జగన్.. అధికారంలోకి వచ్చిన నాలుగునరేళ్ళ తర్వాత ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో అరకొర పోస్టులతో డిఎస్‌సి ప్రకటించడంపై నిరుద్యోగులు మండిపడుతున్నారు. గద్దెనెక్కాక నిరుద్యోగుల్ని ఇంతకాలం ఊరిస్తూ వచ్చారు.ఎన్నికలకు ముందు ఇప్పుడు భర్తీ చేస్తామని ప్రకటించారు.

ఉమ్మడి జిల్లాలో 329 ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తుండటంపై యువత ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఎస్‌జిటిలు 101, స్కూల్ అసిస్టెంట్‌లు 133, టిజిటిలు 95 పోస్టులు మాత్రమే భర్తీ చేయడంపై నిరుద్యోగులు విస్మయం వ్యక్తం చేశారు. లక్షలు ఖర్చుపెట్టి నాలుగేళ్లుగా శిక్షణ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నామని, తీరా తమ ఆశలపై వైసిపి సర్కారు నీళ్లు చల్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. లక్షలు వెచ్చించి బిఎడ్, బిఇడి కోర్సులు పూర్తి చేసిన వారు తమ భవిష్యత్తు ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఇంతకాలం వేచి చూసిన ఉపయోగం లేకుండా పోతోందని కన్నీటి పర్యంతమవుతున్నారు. ముఖ్యమంత్రి నిరుద్యోగుల్ని దగా చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు కొత్తగా నియమితులయ్యే ఉపాధ్యాయులకు ఈసారి అప్రెంటిస్ విధానం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై ఉపాధ్యాయ సంఘాల వారు జిల్లావ్యాప్తంగా ఇప్పటికే అప్రెంటిస్ విధానంపై తీవ్రవ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు.

117 జిఒతో తగ్గిన పోస్టులు...

ఉమ్మడి విశాఖ జిల్లాలో 117 జిఒతో ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం కుదించింది. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని తగ్గించిన నేపథ్యంలో ఎస్ జిటి పోస్టులను భారీ ఎత్తున కోల్పోవాల్సి వచ్చింది. పాఠశాలల విలీనం, రేసనలైజేషన్ ప్రక్రియతో కూడా పోస్టులు బాగా తగ్గాయి. తాజా నోటిఫికేషన్ తో నిరుద్యోగులకు ఎటువంటి ఉపయోగం లేదని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.ప్రభుత్వం స్పందించి డిఎస్‌సిలో పోస్టులను భారీగా పెంచాలని ఆయా సంఘాల నేతలు కోరారు.

ఖాళీలన్నీ భర్తీ చేయాలి

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులన్నీ భర్తీ చేయాలి. 117 జిఓ ద్వారా పేదలకు విద్య అందకుండా పోతోంది. అలాగే నిరుద్యోగులకు శాపంగా మారింది. నాలుగున్నర ఏళ్ల తర్వాత తక్కువగా పోస్టులు భర్తీ చేస్తే నిరుద్యోగుల పరిస్థితి ఏమిటీ. నిరుద్యోగుల ఉపాధిని ప్రభుత్వం అర్థం చేసుకోవాలి.

చీకటి నాగేశ్వరరావు
యుటిఎఫ్ జిల్లా సహ అధ్యక్షులు

2019 నుంచి శిక్షణ

డిఎస్‌సి కోసం సన్నద్ధమవుతున్నాను. తల్లిదండ్రులు కూలి పనులు చేస్తూ చదివిస్తున్నారు. 2019 నుంచి ఊరికి దూరంగా ఉంటూ మైదాన ప్రాంతంలో డిఎస్‌సి శిక్షణ తీసుకుంటూ మెగా డిఎస్ సి వస్తుందని ఆశతో ఇప్పటివరకు రూ. లక్షల ఖర్చు చేశారు. శిక్షణకు, అద్దె గదులు, భోజనానికి రూ.లక్షల ఖర్చు చేశారు. అరకొర పోస్టులు జారీ తో దగా పడ్డాను.

ఎం. మోహనరావు
నిరుద్యోగి, పాడేరు

ఆశలు అడియాశలు

నాలుగేళ్ల తర్వాత పెద్ద సంఖ్యలో డిఎస్ సి పోస్టులు భర్తీ చేస్తారని ఆశపడ్డాం. కానీ ఉమ్మడి జిల్లాలో 329 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్నట్లు తెలిసింది. వేలకు వేలు పెట్టి శిక్షణ కేంద్రాల చుట్టూ తిరిగాం. ప్రభుత్వ ప్రకటనతో ఆశలు అడియాసయ్యాయి

ఎ.రాంప్రసాద్
నిరుద్యోగి, పాడేరు

నిరాశకు గురయ్యాం

నేను బిఇడి (బయాలజీ) పూర్తి చేశా. ఈ సబ్జెక్టులో చాలా తక్కువ పోస్టులు భర్తీ చేస్తున్నారు. దీంతో నిరాశకు గురయ్యాను. డిఎస్‌సి ప్రకటన చూసి నిరుద్యోగులు అసంతృప్తిగా ఉన్నారు. పోస్టుల సంఖ్యను ప్రభుత్వం పెంచాలి

స్వర్ణ
సుండ్రుపుట్టు

ఎస్ఇ ప్రశాంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

రెగ్యులరైజ్ చేయాలని విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి -సీలేరు

రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జెన్‌కో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సీలేరు డొంకరాయి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు స్థానిక ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కార్యాలయం ఎదుట గురువారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ముందుగా కార్మికులు ఎర్రజెండాలు చేత పట్టి సిఐటియు కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదగా ఎస్ఈ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీలేరు జల విద్యుత్ కేంద్రం డిస్ట్రిబ్యూషన్‌లో పనిచేస్తున్న 12 మంది పీస్ వర్కర్లను మాన్ పవర్ వర్కర్లుగా గుర్తించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎస్ఈ సివిల్ కేకేవి. ప్రశాంత్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మణ్, విష్ణు కుమార్ మాట్లాడుతూ 2022 పిఆర్‌సి ప్రకారం వేతన సవరణ చేసి ఎరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని, తెలంగాణ తరహాలో సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంల యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్కె.సుభాన్, డొంకరాయి సీలేరు కాంట్రాక్ట్ కార్మికులు 70 మంది పాల్గొన్నారు.

మారుమూల గ్రామాలకు వెళ్లే మట్టి రోడ్డు

రోడ్లు లేక అవస్థలు

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం ముంపు మండలాల్లోని పలు గ్రామాలకు రోడ్లు, మౌలిక సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నారు. విఆర్.పురం మండలంలోని కల్తునూరు, జీడిగుప్ప, పోచవరం, ఇప్పురు, దారపల్లి తదితర గ్రామాలకు రోడ్ల సౌకర్యం లేదు. ఎప్పుడో వేసిన మట్టి రోడ్లు ఛిద్రమై నడవడానికి కూడా ప్రజలు ఇబ్బంది పడే విధంగా ఉన్నాయి. కూత వేటు దూరంలో ఉన్న మండల కేంద్రం చుట్టూ ఉన్న గ్రామాలకు ఉన్న మట్టి రోడ్లు అస్తవ్యస్తంగా మారి గోతులతో దర్శనమిస్తున్నాయి. పలు గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉంది.పోలవరం ప్రాజెక్టు పేరుతో ఎప్పుడో ఖాళీ చేసే గ్రామాలలో ఇప్పుడు అభివృద్ధి పనులు నిలిపివేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. అన్ని గ్రామాల్లో ఎప్పటి లాగే మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

టిడిపి హయాంలోనే గిరిజన గ్రామాలాభివృద్ధి

ప్రజాశక్తి-చింతపల్లి: మండలంలో గురువారం టిడిపి ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి కొట్టగుల్లి సుబ్బారావు ఆధ్వర్యాన కొమ్మంగి, ఎర్రబొమ్మలు, లంబసింగి, తాజంగి పంచాయతీలోని పలు గ్రామాల్లో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ మంత్రి మణికుమారి మాట్లాడుతూ, తెలుగు దేశం ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి బాట వేసిందన్నారు. కొట్టగుల్లి సుబ్బారావు మాట్లాడుతూ,గిరిజన గ్రామాల్లో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఏర్పాటు చేయగా ఈ ప్రభుత్వం దాన్ని తీసేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎంపిటీసీ సత్యనారాయణ, ముర్లా సత్యనారాయణ చల్లంగి సురేష్, బూత్ కన్వీనర్ ముర్ల రాంబాబు పాల్గొన్నారు.

పాడేరు: మండలంలోని గుత్తులపుట్టు పంచాయతీ సంతబయలులో తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజక వర్గం నాయకుడు కిల్లు వెంకట రమేష్ నాయుడు బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు అడపా నరసింహమూర్తి నాయుడు, మాజీ సర్పంచులు మూడవ వెంకటేశ్వర్లు, బాకురు. బాలరాజు, సిదరి తౌడయ్య, మజ్జి భీమేష్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సోభ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చింతపల్లిలో ప్రచారం చేపడుతున్న మణికుమారి, నాయకులు

వైసిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండల కేంద్రంలో వైసిపి పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వేగం మత్స్యలింగం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అనుకూలంగా ఉండేందుకు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నామని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేసి విజయానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బి.ఈశ్వరి, జెడ్పిటీసి సిహెచ్ జానకమ్మ, ఆ పార్టీ నాయకులు ఎస్.గోపాల్, ఎం శ్రీరాములు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అల్లూరి జట్లు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి క్రీడాకారులు, క్రీడాకారిణిలను విశాఖ పట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు జిల్లా అభివృద్ధి అధికారి ఏ జగన్మోహనరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు. క్రికెట్, కబడ్డి, ఖోఖో, వాలీబాల్, .బ్యాడ్మింటన్ పోటీలకు అల్లూరి జిల్లా జట్లు రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతున్నట్లు తెలిపారు. పోటీలు ఈనెల 9 నుండి 13. వరకు. విశాఖపట్నంలో జరుగుతాయన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతున్న జిల్లా క్రీడాకారులకు జిల్లా కలెక్టరు, జిల్లా జాయింట్ కలెక్టర్ అభినందనలు తెలిపారు.

సీటు కేటాయించాలి

ప్రజాశక్తి- పెదబయలు : వైస్సార్సీపీ నాయకులు డాక్టర్ తనూజకు అరకు పార్లమెంట్ టికెట్ కేటాయించాలని స్థానిక వైస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షులు వంతల ఆనందరావు కోరారు. స్థానిక పార్టీ నాయకులతో చర్చలు జరిపారు. అనంతరం ఆనందరావు గురువారం మాట్లాడుతూ, అరకు ఎమ్మెల్యే శెట్టి ఫాల్గుణ నాలుగున్నర ఏళ్లలో నియోజకవర్గం అభివద్ధికి కషి చేసారన్నారు. మారుమూల ప్రాంతాల్లో పాఠశాలల, వంతెనలు, సి సి హాదారులు మరమ్మతు పనులు చేసారన్నారు. మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబుతో గిరిజనులకు ఒరిగిందేమి లేదన్నారు. తనూజకి కేటాయిస్తే తమంతా కలసికట్టుగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొర్ర ఈజబాబు, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ జర్సింగిగంగ భవాని, కొంటా సూర్యనారాయణ, సీకారి సర్పంచ్ గుల్లెల కష్ణారావు పాల్గొన్నారు.

ప్రచారం చేపడుతున్న అబ్రహం

ఇంజరిలో అబ్రహం పర్యటన

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలోని ఇంజరి పంచాయతీలో బుధవారం టిడిపి రెబల్ సెవెరీ అబ్రహం పర్యటించారు. సివేరి సోమ చేసిన సేవలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలను అందజేశారు అనంతరం అబ్రహం మాట్లాడారు. ప్రజ శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తనకు ఆశీర్వదించాలని కోరారు.తన తండ్రి హయంలో మారుమూల గ్రామాల్లో జరిగిన అభివద్ధి తప్ప ఈ ఐదు సంవత్సరాలలో ఎటువంటి అభివద్ధి జరగలేదని అన్నారు.తనకు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆశీర్వదిస్తే మారుమూల గ్రామాల అభివద్ధి కి పాటుపడతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సోనే దన్ను, రెబల్ టీడీపీ మండల కార్యదర్శి పాంగినాగేశ్వరావు, అరకు పార్లమెంట్ రైతు సంఘం ఉపాధ్యక్షుడు కూడా బుషణ్ రావు, యునిట్ ఇంచార్జి లక్కేరామన్న దొర పాల్గొన్నారు.

ఇవిఎంలు, వివి ప్యాడ్‌లపై అవగాహన

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి -రంపచోడవరం

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈవీఎంలు, వివి ప్యాడ్లపై అవగాహన కల్పించడానికి పిఓలకు, ఏపీఓలకు శిక్షణ ఇవ్వాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం జరిగిన అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల సరళిపై 66 పేజీలతో ఒక హ్యాండ్ బుక్ రూపొందించడం జరిగిందని తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గంలో 399 పోలింగ్ స్టేషన్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సెక్టర్ల అధికారులకు ఎన్నికల సరళిపై శిక్షణ ఇస్తామని చెప్పారు. ఫారం 17లో ఏ విధంగా ఎన్నికల నిర్వహించాలో వివరంగా తెలియజేసినట్లు తెలిపారు. వికలాంగులకు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వెసులుబాటు కల్పిస్తామన్నారు. ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ప్రతిరోజు ఎంత ఖర్చు పెడుతున్నదీ వివరాలు తెలియజేసే విధంగా ఎక్కడికక్కడ అధికారులను నియమించడం జరుగుతుందని చెప్పారు. సమావేశంలో రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు సూరజ్ గనోరే, కావూరు చైతన్య, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్, జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లు వివి రమణ, చెల్లయ్య, సువర్ణ, పణి, పిఎస్ కుమార్, డిప్యూటీ తాసిల్దారులు యన్‌వి వి సత్యనారాయణ, సుబ్బారావు, ఆర్ఐ యం.విగ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు డి.ఇందిరా బాయ్, టీ.లక్ష్మణ్ అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్

రంపచోడవరం ఏరియా ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఏ వైద్య సేవలు అందుతున్నదీ, ప్రతిరోజు సుమారు ఎంతమంది రోగులు వస్తున్నదీ ఆరా తీశారు. ఆసుపత్రికి కావలసిన మందులు ఎప్పటికప్పుడు రిక్వైర్మెంట్ సమర్పించి మందులు అందుబాటులో పెట్టాలని సూచించారు. ఆస్పత్రికి సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఆసుపత్రి ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన తల్లి బిడ్డ ఆస్పత్రిని పరిశీలించారు. కలెక్టర్ వెంట రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల ప్రాజెక్టు అధికారులు సూరజ్ గనోరే, కావూరి చైతన్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మి, ఏడిఎంహెచ్ఓ జి.ప్రకాశం, ఎంపీడీవో హరికృష్ణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు కల్పించాలని ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు

గిరిజనులకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని కోరుతూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జీకే వీధి మండల కమిటీ ఆధ్వర్యంలో పూరిపాకల నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు గురువారం గిరిజనులు నిర్వహించారు. అనంతరం తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గాలికొండ ఎంపీటీసీ సభ్యులు అంపరంగి బుజ్జిబాబు మాట్లాడుతూ జీకే వీధి పంచాయతీలో 28 గ్రామాలకు రెండు సంవత్సరాల నుంచి గిరిజనులకు ఉపాధి పనులు కల్పించకపోవడం అన్యాయమన్నారు. పివిటిజిలకు ఇళ్ల నిర్మాణానికి ఒక్కొక్కరికీ రూ.2.39 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ సొమ్ము సరిపోదని, మరో రూ.2 లక్షలు చొప్పున మంజూరు చేయాలని కోరారు. జాబ్ కార్డులు వినియోగంలోకి ఉంటేనే ఇల్లు మంజూరుకు అర్హులని ప్రభుత్వం నిబంధనలు పెట్టిందని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. జాబ్ కార్డు లేక ఎంతోమంది గిరిజనులు జీవనోపాధి కోల్పోతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ మండల కార్యదర్శి అధ్యక్షుడు కొర్ర బాలయ్య, ముర్ల చంటిబాబు, గేమ్మెల పరమేశ్వరరావు, బాబురావు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

కరపత్ర ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కరపత్ర ప్రచారం

ప్రజాశక్తి- విఆర్.పురం

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై మండలంలోని రేఖపల్లి, గొల్ల గూడెం, శ్రీరామగిరి గ్రామాల్లో ప్రతి గడపకు, ప్రతి షాపు వద్దకు వెళ్లి కరప్రతాలు పంచుతూ ప్రచారం చేశారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా సిపిఎం జిల్లా సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల నాయకులు పంకు సత్తిబాబు మాట్లాడుతూ కేంద్రంలోని మోడి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు భారీగా పెంచిందని, ఉద్యోగాలు కల్పించకపోవడంతో నిరుద్యోగ సమస్య తీవ్రమైందని పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయన్నారు. రాష్ట్రానికి బిజెపి అన్యాయం చేసినా వైసిపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు దానికి వత్తాసు పలకడం దారుణమన్నారు. కార్యక్రమంలో సిరప్ తాతబాబు, హజరత్, జి. లక్ష్మణరావు, సోడి మల్లయ్య, బాబురావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

జికె.వీధి తహశీల్దారుగా రత్నకుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -సీలేరు

జీకే వీధి మండల తహశీల్దారుగా రత్న కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు జీకే వీధి తహశీల్దారుగా ఏడాది పాటు పని చేసిన ఎస్‌విఎల్ ప్రసాద్‌ను శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. విజయనగరం జిల్లా తెర్ల మండలం నుండి రత్నకుమార్ ను జీకే వీధికి బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఆర్ఐ, వీఆర్ఏలు, సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నూతన తహశీల్దారు రత్నకుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

గిరిజన ప్రాంతానికి కేటాయింపులు ఏవీ?

-బడ్జెట్‌పై పలువురు నేతల పెదవి విరుపు

పటొ: మూడు అభిప్రాయాల ఫొటోలు ఉన్నాయి.

ప్రజాశక్తి-పాడేరుటౌన్: వైసిపి సర్కార్ ఏర్పడి దాదాపు ఐదేళ్లు గడిచిపోయింది. ఈ ఏడాదిలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్‌లో గిరిజన ప్రాంత అభివృద్ధికి సంబంధించిన కేటాయింపులేవీ కనిపించలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రవేశపెట్టిన బడ్జెట్ లలో గిరిజన ప్రాంతానికి, గిరిజనులకు వనగూరిన లాభం ఏమి పెద్దగా లేదు.

2019 ఎన్నికల్లో అల్లూరి జిల్లాలో 3 అసెంబ్లీ, ఒక ఎంపి స్థానాలు ఉండగా మూడింటిని వైసిపినే గెలుచుకుంది. దీంతో జిల్లాలో అభివృద్ధి పరుగులు తీస్తుందని గిరిజన ప్రజానీకం భావించారు. గిరిజన ప్రాంతంలో అభివృద్ధి గానీ, గిరిజనుల ప్రయోజనాలకు సంబంధించి రాయితీలు గానీ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేయలేదు. ఇలాంటి పరిస్థితుల్లో చివరి బడ్జెట్ లోనైనా గిరిజన ప్రాంతం, గిరిజనుల వైపు ప్రభుత్వం చూస్తుందేమోనని గిరిజనులు ఎదురు చూశారు. గిరిజనాభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి ఉందో ఈ బడ్జెట్ ప్రసంగం ద్వారా వైసిపి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించిన కేటాయింపులను పరిశీలిస్తే తీవ్ర నిరుత్సాహాన్ని కలిగించింది. చివరి బడ్జెట్ అయినా ఎస్‌టిలకు ఉపయోగకరంగా ఉంటుందని భావించినా ఈ బడ్జెట్ గిరిజన ప్రాంత అభివృద్ధికి నిరాశనే మిగిల్చింది. గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎలాంటి నిధులూ కేటాయించలేదు. ప్రజల ప్రయోజనాలు అభ్యున్నతికి సంబంధించిన అంశాలను విస్మరించింది. వేలాదిమంది నిర్వాసితుల గురించి బడ్జెట్ లో ప్రతిపాదనలు లేవు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పై ఆగ్రహం వ్యక్తమవుతోంది. అంకెల గారేడిగా ఉందని, ప్రజావ్యతిరేక బడ్జెట్ అని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాసితుల సమస్యలపై నిర్లక్ష్యం

తాము అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు ఇస్తున్న 6.25 లక్షల పునరావాస ప్యాకేజీని రూ.10 లక్షలకు పెంచుతామని, 2006కు ముందు సేకరించిన భూములకు ఎకరాకు రూ.5 లక్షలు ఇస్తామని, 18 ఏళ్లు నిండిన యువతకు పరిహారం ఇస్తామని, ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామని, భూములకు భూములు అందిస్తామని వైసిపి చెప్పింది. నాలుగున్నరేళ్లు గడిచిన నిర్వాసితులకు పరిహారం అందించ లేదు. నిర్వాసితుల సమస్యలతో పాటు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన వైసిపి ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్‌లో కూడా నిర్వాసితులకు మొండిచెయ్యే చూపిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గొప్పలుగా బడ్జెట్ ప్రసంగం

సంపన్న ఆంధ్ర, సుపరిపాలన ఆంధ్ర, మహిళ మహారాణి ఆంధ్ర అంటూ గొప్పలు చెప్పుకున్నారు. అంబేద్కర్ పేరు చెప్పి ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా ల్యాండ్ టైటిలింగ్ ఉందని న్యాయవాదులు ఆందోళనలు చేస్తున్నారు. ఆర్థిక మంత్రి మాత్రం వివాదాస్పదమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ని ఘనంగా చెప్పుకోవడం సిగ్గుచేటు.

కె.సురేంద్ర
గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అబద్దాల బడ్జెట్...

వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిండా అబద్దాలే. చెప్పేదొకటి చేసేదొకటి అనే విధంగా ప్రభుత్వం బడ్జెట్ తో మభ్యపెట్టింది. అంకెలతో చెబితేనే అర్థం కాని సామాన్యులకు శాతాల్లో చెప్పి ముఖ్యమంత్రి ప్రజలను బురిడీకొట్టే ప్రయత్నం చేశారు. రూ.1.80 లక్షల కోట్లు నుంచి రూ.2.86 లక్షల కోట్లకు పెంచినా.. ప్రజల నెత్తిన రూ.7 లక్షల కోట్ల అప్పులను పెట్టారు. రెవిన్యూ ఆదాయం పెరిగినా భారీగా ద్రవ్య లోటు అసమర్థ ఆర్థిక నిర్వహణకు నిదర్శనం. అప్పులకు వడ్డీలను కట్టలేని రాష్ట్రంగా మార్చారు.

పి.అప్పలనర్స
సిపిఎం జిల్లా కార్యదర్శి

ప్రజలపై మరింత భారం

బడ్జెట్‌లో రాష్ట్ర ప్రగతిని ఏమాత్రం పట్టించుకోలేదు. ధరలు మరింత పెరిగి, మధ్యతరగతి ప్రజలపై మరింత భారం పడేలా బడ్జెట్ ఉంది. స్వయం ఉపాధి రంగాలను నిర్వీర్యం చేశారు. ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించాలని స్థితిలో అప్పులతో రాష్ట్రం ఉంటే సంపన్న రాష్ట్రం అంటూ ఆర్థిక మంత్రి చెప్పుకోవడం సిగ్గుచేటు. బడ్జెట్ ప్రసంగంలో రాష్ట్రంలో రోడ్లన్నీ బ్రహ్మాండంగా అభివద్ధి చెందాయనడం హాస్యాస్పదంగా ఉంది.

బి.చిన్నయ్య పడాల్
సిఐటియు జిల్లా అధ్యక్షుడు

ఎన్నికల ప్రచార బడ్జెట్

ఓటాన్ అకౌంట్ బడ్జెట్ వైసిపి ఎన్నికల ప్రచార బడ్జెట్ లా ఉంది. ఎన్నికలలో స్వప్రయోజనాల కోసం వైసిపి ప్రభుత్వం బడ్జెట్ రూపొందించింది. ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదు. అన్ని వర్గాల ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. కేటాయింపుల్లో స్పష్టత లేదు. గొప్పలు చెప్పుకోవడం తప్ప అందులో ఏమీ లేదు. ఈ బడ్జెట్టే వైసిపి ప్రజా వ్యతిరేక విధానాలకు నిదర్శనం. ఎన్నికలను పురస్కరించుకుని అంకెల గారడీ చూపారు. ప్రత్యేక హెూదాపై కేంద్రానికి తలొగ్గి రాష్ట్రానికి అన్యాయం చేశారు.

అమర్
ఎఐటియుసి జిల్లా కో-కన్వీనర్

జీపులో వేలాడుతు వెళుతున్న ప్రయాణికులు

ప్రమాదమని తెలిసినా.. తప్పని ప్రయాణం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మారుమూల ప్రాంత గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యం ఉన్నా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించక పోవడంతో గిరిజనులకు రవాణా కష్టాలు తప్పడం లేదు. ప్రమాదమని తెలిసినా తప్పని పరిస్థితిలో గిరిజనులు ప్రైవేట్ జీపులను ఆశ్రయించి రవాణా సాగిస్తున్నారు. మండలంలోని గుంటసీమ ప్రాంతానికి గతంలో ఆర్టిసి బస్సు సౌకర్యం కల్పించి ఉండేది. ఆ తర్వాత బస్సు సౌకర్యం తొలగించడంతో ఈ ప్రాంత గిరిజనులకు రవాణా సౌకర్యం తీవ్ర కష్టంగా మారింది. బస్సు సౌకర్యం లేక తప్పని పరిస్థితిలో గిరిజనులు ప్రైవేట్ జీపులను, ఆటోలను ఆశ్రయిస్తున్నారు. గిరిజనుల అవకాశాన్ని ప్రైవేటు వాహనదారులు ఆసరాగా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారని గిరిజనులు వాపోతున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి అధిక సంఖ్యలో ప్రయాణికులను వాహనాల్లో ఎక్కించుకుని నడుపుతున్నారు. దీంతో పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులు ఎక్కించుకొని రవాణా చేయడంతో గతంలో పలు ప్రమాద సంఘటనలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. మరుమూల ప్రాంతంలో గ్రామాల్లో సంబంధిత రోడ్డు రవాణా శాఖ అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని విచ్చలవిడిగా సొమ్ము చేసుకుంటున్నారని గిరిజనులు తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి గుంటసీమకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని గిరిజనులు కోరుతున్నారు.

సమాధుల స్థలాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు చరిత్రలో సాక్ష్యాధారంగా ఉన్న కవర్టు, హైటర్ల సమాధులు ఉన్న స్థలాన్ని నర్సీపట్నం ప్రజలు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిరక్షించి కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ,
ఆనాడు నర్సీపట్నం-చింతపల్లి ఘాట్ రోడ్లో బ్రిటీష్ సేనలకు, అల్లూరి సేనలకు జరిగిన భీకర యుద్ధంలో నేల కూలిన బ్రిటీష్ సేనానులు కవర్టు, హైటర్ల సమాధుల అర ఎకరం వరకు ఉన్న ప్రాంతమన్నారు. ఆ స్థలాన్ని పరిరక్షించాలని పర్యాటక కేంద్రంగా, అల్లూరి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎన్నోసార్లు అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. త్వరలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి పరిరక్షణకై కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని పడాల వీరభద్రరావు తెలిపారు.

న్యాయం చేయకుంటే పనులను అడ్డుకుంటాం

ప్రజాశక్తి -నక్కపల్లి: వైజాగ్ - చెన్నై ఇండస్ట్రీల్ కారిడార్ కోసం సేకరించిన భూములకు సంబంధించి పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ చెల్లించే వరకు పనులు ప్రారంభించ వద్దని నిర్వాసితులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. మండలంలోని బుచ్చిరాజుపేటలో గురువారం నిర్వాసితుల గ్రామాల నాయకులు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి టిడిపి, సిపిఎం, జనసేన నాయకులు హాజరయ్యారు. ముందుగా నిర్వాసితుల సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, కారిడార్‌లో భూములు కోల్పోయిన నిర్వాశితులైన రైతులకు, కూలీలకు, దళితులకు, చేతి వృత్తిదారులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పూర్తిస్థాయిలో ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగు భూములకు, చెట్లు కు ,నివాసాలకు పూర్తి పరిహారం, పునరావాసం కల్పించే వరకు ఏ విధమైన శంఖుస్థాపన లు, నిర్మాణాలు చేపట్టవద్దని తేల్చి చెప్పారు. ఏపిఐఐసి అధికారులు సమస్య పరిష్కారానికి మార్గం చూపకుండా గ్రామాల్లో విభజించి పాలించు పద్ధతులలో గొడవలు సృష్టిస్తున్నారని దీనిపై ఏపిఐఐసి రాష్ట్ర కమీషనర్ కు, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు పిర్యాదులు చేస్తామన్నారు.

నేడు ఎస్‌టి కమిషన్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి మండలంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకరరావు ఈనెల 9న పర్యటిస్తున్నట్లు ఎస్టీ కమిషన్ మెంబర్ కొర్రా రామలక్ష్మి ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రముఖ పర్యాటక కేంద్రం బొర్రా గుహలో ఏర్పాటు చేసిన జిప్పు లైన్ పరిశీలిస్తారని, అనంతరం బొర్రా సచివాలయం వద్ద అధికారులతో సమావేశం ఉంటుందని తెలిపారు. పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తారని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా కలిసి లిఖిత పూర్వకంగా విన్నవించవచ్చునన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఎస్‌టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ శంకరరావు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలో జోగంపేట ఎస్సీ వసతి గృహంలో చదువుతూ ప్రమాదవశాత్తు మరణించిన తూబిరి డేవిడ్ రాజు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎస్టీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ జివి.శంకరరావు తెలిపారు. మండలంలో జోగంపేట ఎస్సీ వసతి గృహంలో ఏడవ తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థి డేవిడ్‌రాజు విద్యుత్ షాక్ గురై మృతి చెందడంతో గురువారం బాధితుడి కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా జోగంపేటలో విద్యార్థి మృతి చెందిన ఎస్సీ వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. ప్రమాదం జరిగిన విధానంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం వసతి గృహాన్ని పక్కనే ఉన్న మరో భవనంలోనికి మార్పు చేయడం జరిగిందని అధికారులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం విద్యార్థి గ్రామమైన పాత మల్లంపేట శివారు బుడ్డడుపాడు గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ, కుమారుడిని కోల్పోయిన డేవిడ్ రాజ్ తల్లిదండ్రులకు ప్రభుత్వం అండదండలు అందిస్తుందన్నారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, బాధిత కుటుంబానికి మెరుగైన జీవనోపాధిని అందించడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహకారాన్ని అందించడానికి ప్రభుత్వంతో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు.

వంట షెడ్డు లేక.. ఆరుబయటే వంటలు

-అవస్థలు పడుతున్న నిర్వాహకులు
-ఇదీ బాలికల పాఠశాల-2లో దుస్థితి

ఇరుకు రేకు షెడు వంటలు వండుతున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండల కేంద్రంలోని బాలికల పాఠశాల 2 లో కనీసం వంట షెడ్డు లేక పోవడంతో వంట మనుషులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు పథకంతో పాఠశాలలు రూపురేఖలు మారుస్తున్నట్లు చెప్పిన ప్రకటనలకే పరిమితమైంది. బాలికల పాఠశాల 2 లో కనీసం వంట షెడ్డు ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడంతో చిన్న పాటి రేకు షెడ్డులో వంటకాలు చేపడుతున్నారు. చుట్టూ పాడైన సోలార్ ప్లేట్లు అడ్డుపెట్టి ఏర్పాటు చేసిన ఇరుకు షెడ్డులో సుమారు 450 మంది విద్యార్థినిలకు భోజనాలు వండుతున్నారు. 200 నుండి 300 కేజీ ల ఉడికే పాత్రలు వంట పొయ్యిలో ఎత్తి దించుతూ వంటకాలు చేస్తున్నారు.
షెడ్డు వెనుకల ప్రహరి గోడ, పక్కన పాడైన మరుగుదొడ్లు ఉన్నాయి. తరగతి గదులకు భవనాలు మంజూరయ్యాయి తప్ప వంట షెడ్డు, డైనింగ్ హాల్ మంజూరు కాకపోవడంతో విద్యార్థినిలు ఆరుబయటే భోజనాలు చేయవలసిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో వర్షాలకు ఆరుబయట నిలబడి తడుస్తూనే భోజనాలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకొని వంట షెడ్డు, డైనింగ్ హాల్ మంజూరు చేయాలని విద్యార్థినులు కోరుతున్నారు.

14 నుంచి 'గీతం'లో ఎన్‌ఎపి వార్షిక సమావేశాలు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నేషనల్ అకాడమీ ఆఫ్ సైకాలజీ (ఎన్‌ఎపి) 33వ వార్షిక సమావేశాలకు ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గీతం స్కూల్ ఆఫ్ హ్యూమనిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, అప్లైడ్ సైకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, సమావేశాల కన్వీనర్ డాక్టర్ డి.రవిశంకర్ తెలిపారు. సమాజ సుస్థిర అభివృద్ధిలో మానసిక అంశాల పాత్రపై పరిశోధకులు ఈ వార్షిక సమావేశాల్లో విస్తృతంగా చర్చిస్తారన్నారు. డెవలప్‌మెంటల్ సైకాలజీ, సోషల్ సైకాలజీ, కాగ్నిటివ్ సైకాలజీ, ఆర్గనైజేషనల్ బిహేవియర్, ఇండియన్ సైకాలజీ, క్లినికల్, హెల్త్ సైకాలజీ, మిలటరీ సైకాలజీ, జెరో సైకాలజీ, సైబర్ సైకాలజీ అంశాలలో పరిశోధకులు చర్చిస్తారని తెలిపారు. దేశంలోని ప్రముఖ ఐఐటిలు, ఐఐఎమ్‌లు, కేంద్ర పరిశోధనా సంస్థల నిపుణులు, మాజీ వైస్ ఛాన్సలర్‌లు ఈ సమావేశాలకు హజరవుతున్నారన్నారు. పూర్తి సమాచారం కోసం సమావేశాల వెబ్‌సైట్ naop33.gitam.edu పరిశీలించాలని సూచించారు.

అంకెల గారడీ బడ్జెట్

-టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజేశ్వరి

ప్రజాశక్తి-రంపచోడవరం : రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీగా ఉందని టిడిపి నియోజకవర్గం ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి అన్నారు. గురువారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బడ్జెట్ అంచనాలు కొండంత.. ఖర్చులు పిసరంతగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. రూ.13వేల కోట్ల రెవెన్యూ లోటును రూ.44వేల కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనని పేర్కొన్నారు. పన్నుల బాదుడు తప్ప బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమీ లేవన్నారు. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన ప్రతి స్కీమూ ఓ స్కామ్‌గా మారిందన్నారు. అన్నింటి ధరల పెరిగాయని, రిజిస్ట్రేషన్ ఛార్జీలు భారీగా పెంచిన జగన్ సర్కార్, విద్యుత్ ఛార్జీల వడ్డనలో ఎక్కడా రాజీపడలేదని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీకి బడ్జెట్‌లో నిధులు అంతంత మాత్రమే కేటాయించారని తెలిపారు. రైతు భరోసా లబ్ధిదారుల సంఖ్య తగ్గింపు, సున్నా వడ్డీ, పంట రుణాలను 5 లక్షల నుంచి 3 లక్షలకు కుదింపు చేశారని, ఆక్వా రంగాన్ని అథోపాతాళానికి తొక్కారని విమర్శించారు.

నేడు ఐదు మండలాల్లో విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం 220/33 కెవి సబ్ స్టేషన్ మరమ్మతులు, నేషనల్ హైవే రోడ్ల విస్తరణలో భాగంగా రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లో శుక్రవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ యం.డి.యూసఫ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేయించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : జాతీయ నులిపురుగుల దినోత్సవంలో భాగంగా ఈ నెల 9న శుక్రవారం అన్ని పాఠశాలల్లో 1-18 సంవత్సరాలు నిండిన పిల్లలకు ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలు వేయించాలని జిల్లా అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.ప్రకాశం సూచించారు. రంపచోడవరం డివిజన్ పరిధిలోని పీహెచ్‌సీలకు ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రలు 64000 సరఫరా చేసినట్లు చెప్పారు. ఆరోగ్య కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, పాఠశాలల హెచ్‌ఎంలు మధ్యాహ్నం భోజనం తర్వాత విద్యార్థుల చేత మింగిచడం జరుగుతుందని తెలిపారు.

21,448 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని 11 మండలాలలో ఈ సంవత్సరం రైతులు పండించిన వరి ధాన్యాన్ని 45 కొనుగోలు కేంద్రాల ద్వారా 21,448 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. గురువారం తన ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలోని రూ.46.82 కోట్లు ఖర్చుతో 4443 మంది రైతుల వద్ద నుండి ఈ ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు 25.51 కోట్ల రూపాయలు ధాన్యం అమ్మిన రైతులకు చెల్లించడం జరిగిందని, ఇంకా 21.31 కోట్లు చెల్లించవలసి ఉందని తెలిపారు.

నేడే సింహాద్రి అప్పన్న తెప్పోత్సవం

విజయవంతంగా ట్రయల్ రన్

ట్రయల్ రన్‌లో పాల్గొన్న పోలీసులు, దేవస్థానం అధికారులు

ప్రజాశక్తి- సింహాచలం : సింహాద్రి అప్పన్న తెప్పోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈనెల 9న, శుక్రవారం సాయంకాలం కొండదిగువ వరహా పుష్కరిలో 5:30గంటలకు స్వామి హంస వాహనంపై పుష్కరిణి చెరువులో విహరించేందుక అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం సాయంకాలం ఎసిపి అన్నెపు నరసింహమూర్తి, గోపాలపట్నం సిఐ సురేష్ తదితరులతో కలిసి, ఆలయ ఇఒ ఎస్ శ్రీనివాసమూర్తి, దేవస్థానం ఇఇ శ్రీనివాసరాజు, రాంబాబు ఆధ్వర్యంలో ట్రయిల్ రన్ నిర్వహించారు. స్వామి విహరించే పడవను సర్వాంగసుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. భారీగా వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఇఒ తెలిపారు.

వేడుకలో భాగంగా శుక్రవారంఉదయం దేవాలయ అర్చక బృందం సంప్రోక్షణ చేస్తారు. సాయంత్రం 4గంటలకు వేణుగోపాలుడు అలంకరణలో స్వామి మెట్ల మార్గంలో కొండదిగువ తొలి పావంచా చేరుకుంటారు. అక్కడినుంచి పుష్కరిణికి చేరుకొని, ప్రత్యేక వేదికపై ఐదున్నర గంటలకు భక్తులకు దర్శనమిస్తారు అనంతరం హంసవాహనంపై జల విహారం చేస్తారు రాత్రి 7:15 గంటల వరకు పుష్కరిణి మధ్యలో ఉన్న మండపంలో పూజలు నిర్వహిస్తారు. తర్వాత పుష్కరిణి సత్రము వద్దకు చేరుకొని, 8:15గంటల నుంచి సర్వజన మనోరంజని వాహనంపై మాడవీధుల్లో తిరువీధి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. తర్వాత పైడితల్లమ్మ గుడి వరకు వెళ్లి, మెట్లు మార్గంలో కొండపైకి చేరుకుంటారు.
ఈ సందర్భంగా కొండపై స్వామి దర్శనాలు శుక్రవారం సాయంత్రం 6గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామి ఉంటుందని ఆలయ అధికారులు వెల్లడించారు. శనివారం ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన సేవా టికెట్లు రద్దుచేశారు.

వైఎస్.షర్మిల పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -సీలేరు : చింతపల్లిలో ఈనెల 10న పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల చేపట్టిన పర్యటన విజయవంతం కాంగ్రెస్ బీసీ సెల్ అల్లూరి జిల్లా నాయకులు కారే. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జికె.వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షర్మిల్ పర్యటనకు భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి వెళ్లడానికి కార్యచరణ రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో దుప్పులవాడ, గుమ్మిరేవుల మాజీ సర్పంచ్‌లు అల్లంకి రాజు, బాబురావు, నాయకులు రాంబాబు, మల్లు దొర, ఎం.సత్తిబాబు, వానపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

మలేరియా విభాగం కార్మికులను పర్మినెంట్ చేయాలి

కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రాంబాబు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి మలేరియా విభాగంలో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ కార్మికులుగా గుర్తించి, వారికి ప్రభుత్వపరంగా ప్రయోజనాలను కల్పించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, గాజువాక జోన్ కమిటీ నాయకులు, గొలగాని అప్పారావు, ఎం. రాంబాబు, డిమాండ్ చేశారు. గురువారం గాజువాకలో నిర్వహించిన యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ, ప్రభుత్వం సీజన్ వ్యాధులకు అనుకూలంగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సేవకులుగా మలేరియా వర్కర్లుతో తాత్కాలికంగా పనిచేయించుకోవడం దుర్మార్గమన్నారు. మలేరియా కార్మికులను రెగ్యులర్ కార్మికులుగా గుర్తించడంతోపాటు, మధ్య దళారీల ప్రమేయాన్ని నివారించాలన్నారు. కాలనీలు, వాడల విస్తరణతో వీరికి పనిభారం పెరుగుతోందని, అదనపు కార్మికులను నియమించడం ద్వారా, ప్రయోజనాలను గానీ కల్పించడం లేదన్నారు. దోమల నివారణకు నాసిరకం కెమికల్స్ వాడడం వల్ల ప్రజాధనం దుర్వినియోగమే తప్ప ప్రయోజనం ఉండడం లేదన్నారు. కార్మికులకు సేఫ్టీ పరికరాలు సబ్బులు, మాస్కులు, గ్లౌజులు, రెయిన్ కోట్‌లు ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్త సమ్మె సందర్భంగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలకు జిఒలు జారీచేసి అమలు చేయాలన్నారు. సమావేశంలో వై. చిన్నారావు, శ్రీను, శివంగి, భవాని పాల్గొన్నారు.

అనకాపల్లి ఎంపీ సీటుకు ఆడారి యత్నాలు?

- ఢిల్లీలో చంద్రబాబును కలిసిన కిశోర్‌కుమార్

చంద్రబాబుకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న కిశోర్‌కుమార్

ప్రజాశక్తి- సీతమ్మధార : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ స్థానానికి తెలుగుదేశం అభ్యర్థిగా సీటు దక్కించుకోవడానికి ఆడారి కిషోర్‌కుమార్ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. బుధవారం ఢిల్లీ వెళ్లిన టిడిపి అధినేత చంద్రబాబును ఎంపి గల్లా జయదేవ్ ఇంట్లో కలిసి, తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరినట్లు సమాచారం. న్యాయశాస్త్రంలో పిహెచ్‌డి చేసిన ఉన్నత విద్యావంతుడైన కిశోర్‌కుమార్, దశాబ్దాల కాలంగా విద్యార్థి దశ నుంచి ప్రజా ఉద్యమాలను సొంతంగా నడిపిన నేపథ్యం ఉంది. చంద్రబాబు అరెస్ట్ సమయంలో దేశవ్యాప్తంగా ఆడారి కిషోర్‌కుమార్ చేసిన ఆందోళనలు సంచలనంగా మారాయి. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా లోకేష్ యువగళం పాదయాత్ర ప్రచారంలోనూ కిశోర్‌కుమార్ కీలకంగానే వ్యవహరించారు. సామాజిక స్పృహ, ప్రజల్లోకి చొచ్చుకుపోయే స్వభావం ఉన్న తన అభ్యర్థిత్వాన్ని అనకాపల్లి పార్లమెంట్ స్థానంలో పరిశీలించాలని అడారి కోరుతున్నారు. ఇప్పటికే అనకాపల్లి స్థానానికి పెద్దపోటీ ఉన్న నేపథ్యంలో చంద్రబాబు ఎలా స్పందిస్తారో చూడాలి.

కేన్సర్ చికిత్సకు 'కార్-టి సెల్' థెరపీ

రాష్ట్రంలో మొదటిసారిగా అపోలో ఆసుపత్రిలో ప్రారంభం

మాట్లాడుతున్న అపోలో ఆంకాలజిస్టులు

ప్రజాశక్తి - ఆరిలోవ : లుకోమియా, లింపోమా వంటి కొన్ని రకాల రక్త కేన్సర్లను పారదోలడానికి అధునాతన చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్ (సిఎఆర్)-టి సెల్ అందుబాటులోకి వచ్చిందని ఆరిలోవ అపోలో ఆసుపత్రి ఆంకాలజీ విభాగం వైద్యనిపుణులు వెల్లడించారు రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఈ వైద్యవిధానంలో ఒక లుకోమియా రోగికి వైద్యం చేశామని వెల్లడించారు.
గురవారం అపోలో ఆసుపత్రిలో మీడియాతో అంకాలజిస్టులు డాక్టర్ బోయ రాకేష్‌రెడ్డి, సిఇఒ రామచంద్ర, డాక్టర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ, ఇప్పటివరకు కేన్సర్ వ్యాధి నివారణకు ఆపరేషన్, కిమోథెరపీ, రేడియేషన్ వంటి వైద్యవిధానాలను అవలంభించే వాళ్లమన్నారు. ఇపుడు కేన్సర్ రోగులకు వరంలా కార్-టి సెల్ థెరపీ అందుబాటులోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలోనే మొదటిసారిగా ఈ వైద్య విధానం ద్వారా ఆరిలోవ అపోలో ఆసుపత్రిలో లుకోమియా రోగికి వైద్యం చేసామని వెల్లడించారు.
శరీరంలో రక్తంలోని టి-సెల్స్‌ను సేకరించి, ప్రయోగశాలలో మెడికల్ ఇంజినీరింగ్ నైపుణ్యంతో కేన్సర్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే కణాలుగా వాటిని అభివృద్ధి చేసి, తిరిగి మనిషి శరీరంలోకి వాటిని ప్రవేశపెడతారు. వీటికున్న స్వీయరక్షణ సామర్థ్యంతో శరీరంలోని కేన్సర్ కారక కణాలను నశింపజేయడంతోపాటు, కొత్త కణాల రాకుండా అడ్డుకోవడంతో ప్రముఖపాత్ర పోషిస్తాయన్నారు. కార్-టి సెల్ థెరపీ కొన్ని రకాల కేన్సర్ రోగులకు వరం కానుందని వెల్లడించారు.